**జరిగిన కథ :** కన్యాకుబ్జ రాకుమారులు ఐదుగురు దిగ్విజయ యాత్ర చేస్తూ సుడిగాలిలో చిక్కుకున్నారు. పెద్దవాడైన విద్యాసాగరుడు శ్రీనగర యువరాణిని పెళ్లి చేసుకున్నాడు. మిగిలిన నలుగురిలో ముగ్గురు రాకుమారులు..
చిలకలగుట్ట మీద నీళ్లు తాగి చిలకల్లా మారిపోయారు. ఆ ఉదంతాన్ని చూసిన హరివర్మ తన తమ్ముళ్లను తెలివిగా రక్షించుకున్నాడు. అంతకుముందు జరిగిన కథను అందరితో వివరంగా చెబుతున్నాడు.




కాశీ మజిలీ కథలు 77

# చిలకలగుట్ట మర్మం

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

ప్రశాంతమైన సరస్సులో ఉన్నట్లుండి సుడిగుండాలు చెలరేగసాగాయి. నీటి అడుగు నుంచి చేప, మొసలివంటి జలచరమేమీ కాని వింత ఆకారమొకటి నెమ్మదిగా పైకి లేవసాగింది. అది చూసి నేను గట్టుపైకి పరుగెత్తి, ఆయుధం ధరించి నిలబడ్డాను. ఆ ఆకారానికి మూరెడేసి గోళ్లున్నాయి. మోకాళ్లవరకూ వేలాడే పొడవాటి జటలున్నాయి. ఆ ఆకారం నా ఎదురుగా ఉన్న గట్టుమీదికి వెళ్లి కూర్చుంది. జాగ్రత్తగా గమనిస్తే అదొక మానవాకృతి అని తెలిసింది. ఆయన కొద్దిపాటి ధ్యానం అనంతరం, సూర్యునికి అర్ఘ్యమిచ్చాడు. ఒక చెట్టుకింద దోసిలిపట్టి నిలుచున్నాడు. ఆ చెట్టునుంచి కొన్ని పళ్లు ఆయన దోసిట్లో రాలిపడ్డాయి. వాటిని ఆయన భగవంతునికి నివేదించి, భుజించాడు.

నేను ఆ వింతను కళ్లారా చూస్తూ..

'ఈ మహాముని ఎవ్వరో కానీ, జలస్తంభన చేసి.. ఈ తటాకంలో మునిగి జపం చేసుకుంటున్నట్లు ఉన్నాడు. ఇప్పుడెందుకో బాహ్యస్మృతి కలిగినందువల్ల బయటికి వచ్చాడు. నేను ఆయనను ఆశ్రయిస్తే, నా సమస్యకు పరిష్కారం దొరకవచ్చు' అనుకుని, పరుగు పరుగున ఆయన వద్దకు వెళ్లి.. పాదాలపై పడ్డాను.

ఆ ముని ఎర్రని కళ్లతో..

''ఎవడవురా నువ్వు? ఈ నిర్జన ప్రదేశంలోకి ఎలా వచ్చావు? సరస్సులో నీటిని తాగలేదా?!'' అని గద్దించాడు.

అప్పుడు నేను..

''మహాత్మా! నేడు నా జన్మ పండినది. మీ దృష్టి ప్రసారం నాపై పడటంతో నా పాపాలు పటాపంచలైనవి'' అంటూ స్తోత్రపాఠాలు ప్రారంభించాను.

ఆయన నాకు ప్రసన్నుడై..

''ఈ స్తుతివచనాలకేమి? నీ మనసులోని కోరికేమిటో చెప్పుకో'' అన్నాడు.

''స్వామీ! నేను మా సోదరులతో కలిసి, సుఖంగా ఇంటికి తిరిగి వెళ్లేలా ఆశీర్వదించండి'' అని కోరాను.

అప్పుడు ఆ సిద్ధుడు క్షణంసేపు కళ్లు మూసుకుని, కూర్చున్న చోటునుంచి లేచాడు. సమీపంలోని ఒక మూలికను తెంపి తెచ్చి నా చేతిలో పెట్టాడు. దానిని ప్రయోగించే విధానం వివరంగా చెప్పి..

''ఇక వెళ్లు. నీ కోరిక త్వరలో నెరవేరుతుంది'' అంటూ ఆయన మళ్లీ చెరువులోకి మునిగిపోయాడు.

ఆ యోగి మూలంగా నా కర్మసూత్రం సడలిపోయిందని సంతోషిస్తూ.. ఆయన ఇచ్చిన మూలికను పదిలంగా మూటకట్టుకున్నాను. అడవి చిలకలను వెతుక్కుంటూ వాటిని పట్టుకోవడానికి ప్రయత్నించసాగాను. కానీ, నన్ను చూడగానే చిలకలు ఎగిరిపోతున్నాయి.

అప్పుడు నేను బాగా ఆలోచించి, సిద్ధుడిచ్చిన మూలికను మట్టిముద్దలో కలిపి.. ఆ ఉండలను చిలకలకు తగిలేలా విసురుతూ పోసాగాను. అలా చాలాకాలం నా ప్రయత్నం కొనసాగింది. ఒకనాడు ఒక చెట్టుకొమ్మపై కూర్చుని ఉన్న చిలకవైపు మట్టి ఉండ విసిరేసరికి అది కాస్తా.. అందమైన యువతిగా మారింది.

..అని చెబుతూ, హరివర్మ తన భుజంమీది చిలకను చేతిలోకి తీసుకున్నాడు.

''ఆమె ఈమెయే!..'' అంటూ ఓషధీ లతను ఆమెకు తగిలించాడు.

వెంటనే ఆ చిలక మనోహరమైన యువతిగా ఆకారాన్ని ధరించింది. ఆ తరువాత ఆమె తన కథను స్వయంగా ఇలా చెప్పింది..

''నేను అవంతీ రాకుమారిని. నా పేరు చారుమతి అంటారు. నేను మా తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కూతురిని. నేను నా స్వయంవర సభాభవనంలో వరమాల చేతిలో పట్టుకుని నడుస్తూ ఉండగా.. ఎక్కణ్నుంచో ఒక బ్రహ్మరాక్షసుడు వచ్చిపడ్డాడు. చూస్తున్నవారంతా హాహాకారాలు చేస్తుండగా.. నన్నెత్తుకుని, గరుడపక్షిలా ఆకాశంలోకి ఎగిరాడు. నేను అతని పట్టునుంచి విడిపించుకోలేక గిలగిల్లాడాను. వాడు నన్ను ఒక కొండమీదికి తీసుకుపోయి కిందికి దింపాడు.

''సుందరీ! నేను మధువనే రాక్షస చక్రవర్తిని. నాతో సమవుజ్జీ అయినవాడు ముల్లోకాలలోనూ లేడు. గగనవీధిలో పోతూ కిందనున్న నీ సౌందర్యం చూసి మోహాన్ని ఆపుకోలేకపోయాను. అందుకే నిన్ను ఎత్తుకొని వచ్చాను. నన్ను వరించు'' అని పలికాడు.

నాకు విపరీతమైన కోపం వచ్చి నోటికి వచ్చినట్లు తిట్టసాగాను. కొంతసేపటికి నాలుక ఎండిపోయి మాటరాక ఎక్కిళ్లు వచ్చాయి. దాంతో వాడు కంగారుపడ్డాడు.

''అయ్యయ్యో ప్రేయసీ! ఏమైనది.. మంచినీళ్లు కావాలా?! చిటికెలో తెస్తానుండు!'' అంటూ తటాకం